

ఆయనతో కూర్చోవడమే ఒక జ్ఞాన సంపద అనే
అభిప్రాయం మాకు కలిగించిన మహా మేధావి

# జే.కే.సి. కళాశాల కీర్తిప్రదాత - రోసయ్య

**శ్రీ పాతూరి కోటేశ్వరరావు,** M.Sc.,
Former Lecturer in Chemistry, J.K.C.College.

## నా మొదటి పరిచయం

అది 1968 జూన్ 6వ తేది ఉదయం 11 గంటల పదిహేను నిముషాలు మాన్యులు డ్కాక్టర్ సదాశివరావుగారి అనుజ్ఞ మేరకు ప్రిన్సిపాల్ రోసయ్యగారి ఆఫీసులోకి అడుగుపెట్టాను. కర్మకాలి నాతోపాటు నాకు ఏ మాత్రము పరిచయములేని ఒక విద్యార్థి పి.యు.సి.లో సీటు కోసం లోపలికి వచ్చాడు. నేను అతి మర్యాదగా, అమాయకంగా డ్కాక్టర్‌గారు మిమ్మల్ని కలవమని పంపించారండి అని అంటూ వుండగానే నా మీద గయ్యిమని లేచారు. నన్ను మాట్లాడనియ్యకుండా ఒకటే కేకలు. విషయం ఏమీ నాకర్థం కావడం లేదు. పది నిముషాలు అయిన తరువాత ఎందుకు సార్ అలా మాట్లాడుతున్నారు. నేను ఉద్యోగం కోసం వచ్చాను. డ్కాక్టరు గారు మిమ్ములను కలిసి ఇంటర్వ్యూ కార్డు తీసుకోమన్నారు అని చెప్పాను. అయితే ఈ అబ్బాయిని ఎందుకు తీసుకొచ్చావు? వచ్చీరాకముందే రికమండేషన్లా? సీట్లు మెరిట్ వున్నవారికే యిస్తాము. రికమండేషన్లు నా దగ్గర చెల్లవు అని నిర్బంధ్వంగా చెప్పారు. సార్, ఆ అబ్బాయి ఎవరో నాకు

తెలియదన్నాను. ఆ సంగతి ముందే చెప్పొచ్చుగా అని ముఖం చిట్లించారు. మీరు చెప్పనిస్తే గదా అని నేనన్నాను. దానికి పెద్దలతో మాట్లాడం నేర్చుకో. ఏం పల్నాటి వాడవా, తల బిరుసుగా వున్నావు అని మళ్లా కోప్పడ్డారు. ఇది మా తొలిపరిచయం. డాక్టరు గారికి ఈ విషయం చెబితే పైకి అట్లా వుంటారుగాని రోసయ్యగారి మనస్సు చాలా మంచిది. ఎవ్వరికి హాని చేయ్యని మనిషి అని తన అభిప్రాయాన్ని తెలియజేసారు. తరువాతి రోజుల్లో ఆయన ప్రేమ అభిమానం చూరగొన్న అతి కొద్ది మందిలో నేను ఒకణ్ణి.

## జే.కే.సి. కళాశాలపై పిచ్చి అభిమానం

ఒక రోజు ఆఫీసులో ఆయనతో మాట్లాడుతూ వుండగా పోస్ట్‌మాన్ వచ్చి ఒక రిజిష్టర్ పార్శిల్‌యిచ్చి ఎక్నాలెడ్జ్‌మెంట్ కాగితం మీద సంతకం చెయ్యమని ముందు పెట్టాడు. ఆ కాగితం మీద ఏముందో తెలియదుగాని ఆ పార్శిల్ తీసుకొని పోస్ట్‌మాన్ మొఖంమీద కొట్టారు. అతనూ, మేమూ అందరం బిత్తరపోయాము. ఈ లోపు సీట్లోనుంచి లేచి ఏమనుకుంటున్నావు. జే.కే.సి. కాలేజి అంటే, ఏదో నిన్నగాక మొన్న పెట్టిన బడి క్రింద రాస్తావా, ఇప్పుడు చెప్తున్నా విను. ఎన్ని పార్శిళ్లున్నా, నీ వరస క్రమమేదైనా, జే.కే.సి. పేరు అన్నిటికన్నాపైన వుండాలి. గుర్తుంచుకో, అని గదమాయించారు. అది అతనికీ, మాకూ అసమంజసమని అనిపించింది. మరల ఉగ్రరూపంతో ఇది సమంజసమో, అసమంజసమో నాకు అనవసరం. జే.కే.సి. పేరు ఎప్పుడూ అన్నింటికన్నా పైన వుండాలి అన్నారు. ఇది అభిమానమో, పిచ్చి అభిమానమో మీ నిర్ణయానికే వదిలివేస్తున్నాను.

## తెలుగు, ఆంగ్ల భాషల సవ్యసాచి

ఒక రోజు ఎవరో అడ్మిషన్ పనిమీద మీరు మాకు A.C.Collegeలో ''Milton's Paradise Lost'' చెప్పారు సార్ అని అంటూ ఉన్నాడో లేదో ఆపు, ఆపు అని రోసయ్యగారు ఇంగ్లీషులో

మాట్లాడం మొదలుపెట్టారు. ''Did you wash your mouth, have you taken bath'' మాకర్థం కాలేదు. ఎందుకిలా మాట్లాడుతున్నారా అని; అది ఆయనకు మిల్టన్ మహాకవిపట్ల ఆరాధన. మిల్టన్ పేరు ఉచ్చరించాలంటే నోరు పరిశుభ్రంగా వుండాలని పారడైజ్ లాస్ట్ గ్రంథాన్ని స్మరించాలంటే స్నానంచేసి మలినరహితంగా ఉండాలన్నట్లుగా ప్రవర్తించేవారు.

తెలుగులోకూడ గ్రాంధిక భాషపై మక్కువ వ్యవహారిక భాషపై వ్యతిరేకత ఆయనకు చిన్నయసూరి, రామరాజభూషణుడు, నన్నెచోడదేవవర్మ మొదలైన దిగ్గజాలపై మక్కువకు కారణమయింది. జే.కే.సి. కాలేజిలో సాహిత్య సభలుకూడా ఆ స్థాయిలోనే ఆయన ఆధ్వర్యంలో నిర్వహింపబడ్డాయి. కట్టమంచి రామలింగారెడ్డి గారన్నా మంచి అభిమానం. ఆయన ఊరు కట్టమంచి వెళ్లి, పెరిగిన పరిసరాలు ప్రత్యేకంగా చూచి రావడం ఒక నిదర్శనం.

మహా పండితులైనా రోసయ్యగారితో మాట్లాడాలంటే భయపడేవారు. పదాల పడికట్టులోనూ, వ్యాకరణంలోనూ, ఉచ్చారణ లోనూ ఆయనకు ఆయనే సాటి.

## నిర్దిష్ట విద్యా విధానం

విద్యా బోధనలో రోసయ్యగారికి నిర్దిష్టమైన అభిప్రాయాలు, ఆచరణలో సాధ్యాసాధ్యాలపైన మంచి అవగాహన వుంది. ఆయన దృక్పథం మా కాలేజి ప్రాస్పెక్టస్ కవర్ పేజి వెనుక ముద్రించబడింది. అదే ''Better untaught than mistaught'' చక్కటి సూక్తి, తప్పులు నేర్పించేకన్నా అసలు నేర్పకుండటమే మేలు. అందుకనే చెప్పే విషయంలోగాని లోపాలుంటే లెక్చరర్లని ఒంటరిగా పిలిచి మరొకరు కించపరచకుండా వుండేటట్లు అభివృద్ధి చేసుకొండి అని చెప్పేవారు. ఏ లెటర్ ప్రిన్సిపాల్‌గారికి ఎడ్రస్ చేసినా, పంక్చుయేషన్‌తో సహా నిశితంగా పరిశీలించి క్రమంగా మా భాషాభివృద్ధికి తోడ్పడ్డారు. సాహిత్యంపై

మాలో కొంత మందికి అభిరుచిపెంచే విషయాలెన్నో తన తీరిక సమయంలో చెప్పేవారు. ఆయనతో కూర్చోవడమే ఒక జ్ఞాన సంపద అనే అభిప్రాయం మాకు కలిగించిన మహా మేధావి.

విద్యార్థులలో ఉత్తమ విలువలు పెంపొందించే ప్రయత్నం ఎంతో చేసారు. ఏ మాత్రం సమయం దొరికినా పిల్లలను పిలిచివారి అభిరుచులు తెలుసుకొనేవారు. మంచి పుస్తకాల గురించి, మంచి వ్యక్తులను గురించి, ఆరోగ్యాన్ని గురించి, ఆటలను గురించి చెప్పేవారు. తప్పుచేసినప్పుడు తిట్టినా, తరువాత ప్రేమతో లాలించి తన కోటు జేబులోని చాక్లెట్లు యిచ్చేవారు.

## పరీక్షల నిర్వహణ- పలువురి ప్రశంస

పబ్లిక్ పరీక్షల నిర్వహణలో రోసయ్యగారి విధానం యూనివర్శిటీ ప్రశంసలందుకున్నది. అదే పద్ధతి తరువాతి కాలంలో కూడా ప్రత్యేకత సంతరించుకున్నది. కాపీయింగ్ రహిత పరీక్షలు, స్వయంగాతానే కొందరి విద్యార్థుల చెకింగ్, నిర్మొహమాట చర్యలు గట్టి పునాదికి కారణాలు. నిర్వహణకు మించి బండిల్ ప్యాకింగ్ అత్యద్భుతం. క్రింద, పైన అట్టలు దానిపై చక్కని అక్షరాలతో అడ్రస్. వందలకొలది ఉన్నా బండిల్స్ అన్నింటిలో జే.కే.సి. ప్రత్యేకత. ఇది రోసయ్యగారి ఘనత, ప్రతి విషయంపై ప్రత్యేకశ్రద్ధ.

ఒకసారి ఏదో ఉద్యమం తరువాత విద్యార్థుల అలజడి. పరీక్షల నిర్వహణలో సమస్య, అన్ని కళాశాలలలో చూసి చూడనట్లు పరీక్షలు నిర్వహించారు. అప్పుడుకూడా దాదాపు 30 మంది విద్యార్థులు మా కాలేజిలో డీబారు అయినారు. విజ్ఞాపనలు, విన్నపాలు, కాని రోసయ్యగారి స్థిర నిర్ణయం. పరిస్థితులకు తలొగ్గకుండ ఉండటంవల్ల జే.కే.సి. కీర్తి పతాకస్థాయికి చేరడం జరిగింది.

## పఠన మందిరం- ప్రత్యేకం- ప్రతిష్ఠాత్మకం

జే.కే.సి. పఠన మందిరానికి రోసయ్యగారి పేరు పెట్టడం ఎంతో సముచితం. తను తీసుకొన్న శ్రద్ధ శ్లాఘనీయం. ముఖ్యంగా ఇంగ్లీషు,

తెలుగు పుస్తకాలు పలువురి ప్రశంసలనందుకున్నాయి. కొన్ని తెలుగు, సంస్కృత గ్రంథాలు బెనారస్ వెళ్లి స్వయంగా తీసుకొచ్చారు. ఆయన వ్యక్తిగత లైబ్రరీలోకూడా ఎక్కడా దొరకని పుస్తకాలు వున్నట్లు పలువురు యూనివర్సిటీ ప్రొఫెసర్లు చెప్పుకునేవారు. పరిశోధకులు పలువురు లబ్ధి పొందేవారు.

పొరపాటునకూడా నవలలను, చౌకబారు సాహిత్యాన్ని, మాగజైన్లను లైబ్రరీలోకి రానివ్వలేదు. తక్కువ స్థాయివాడు ఐదు నిమిషాలుకూడా లైబ్రరీలో నిలువకుండా, ఎక్కువ స్థాయివాడు ఎన్ని గంటలైనా లైబ్రరీలో కదలకుండా వుండే ఉన్నత విలువలను స్థాపించారు.

## అధ్యాపకుల పనితీరుకు నిలువుటద్దం ఆయన ఉపయోగించిన కలాలు:

అధ్యాపకుల పనితీరు నిర్ణయించడంలో ఆయన బాణి ప్రత్యేకం. స్టాఫ్ అటెండెన్స్ రిజిస్టర్ చూస్తే ఆయన ఉపయోగించే సిరాలు వివిధ వ్యక్తుల పనితీరుకు ప్రతిబింబాలు. రెగ్యులర్‌గా పనిచేస్తూ పొరపాటున ఒకరోజు సంతకం చేయకపోయినా, ఏదైనా పనిబడి ఆలస్యంగా వచ్చిన వారికి పెన్సిల్‌తో కనబడి కనబడనట్లు ఒక చుక్క పెట్టేవారు. కొంచెం irregularగా వుండి లేటుగా వస్తే blue inkతో చిన్నగుర్తు పెట్టేవారు. ఎక్కువసార్లు లేటుగావస్తే green ink. మరీ ఎక్కువ సార్లు లేటుగా వస్తే red inkతో గుర్తుపెట్టేవారు. యింకా కొద్దిమందైతే రెడ్ ఇంక్‌తో క్వొశ్చన్ మార్కుపెట్టించుకునేవారు. వీళ్లు పిల్లల్లోగాని, కుటుంబ సభ్యుల్లోగాని, సమాజంలోగాని ఏమాత్రం అభిమానంలేక ప్రభుత్వ చట్టాలద్వారా ఉద్యోగ రక్షణపొందేవారని అనేవారు. ఇట్లాంటి వారిని గురించికూడా మేనేజ్‌మెంట్ వారికి ఏనాడూ చెప్పలేదు. యిదివారి గొప్ప గుణానికి తార్కాణము.

## మరపురాని సంఘటనలకు మచ్చుతునకలు

❖ 1968 కాలేజిలో చేరిన లెక్చరర్లు ఎక్కువమంది పెళ్లికానివారే. ఒక లెక్చరర్ పెండ్లి రోజు శెలవుపెట్టి మరల మూడో రోజు శెలవు అడిగితే

ఆ లగ్నము రాత్రికదా పగలు సెలవెందుకని గ్రాంటు చెయ్యని ఘన చరిత్రకలిగినవారు.

❖ అందరూ ఆరాధించే డాక్టరు సదాశివరావుగారు ఒకరోజు రోసయ్యగారి ఆఫీసులో అడుగు పెడుతుండగా ఆయనతో అడ్మిషన్‌కు రికమండేషన్ పొందిన ఒక విద్యార్థి కాకతాళీయంగా ప్రవేశించడం జరిగింది. తన సహజమైన ధోరణిలో ఆ డాక్టరుకేమి పనిలేదు. మందులు రాసిచ్చినట్లు చీట్లు రాయడమేనా, వెళ్లు, సీట్లు రికమండేషన్లు మీద రావు అని కసిరి కొట్టారు. డాక్టరుగారు ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ మూడ్ సరిగా లేదులే అని బయటకు వెళ్లారు.

❖ రోసయ్యగారు స్ట్రిక్ట్‌గా వుండటం వల్ల ఆయనకు సన్నిహితంగా వుండి సేవలుచేసే అటెండరు కొలగాని వెంకట్రావుని చూసి స్టాఫ్ గడగడలాడే వారు. అతను స్టాఫ్ రూమ్‌కి వస్తున్నాడంటే లెక్చరర్లకు గుండె దడ పుట్టేది. అందరూ అతనికి Veranda Principal అని నిక్‌నేమ్ పెట్టారు.

❖ మొట్టమొదటి సంవత్సరమే In-charge Principalగా వుండగానే కళాశాల వైస్ ప్రెసిడెంట్ శ్రీ మంగళదాసుగారు పంపిన కుర్రవానికి సీటు యివ్వకుండా చరిత్ర సృష్టించి తిరిగి ఆయన చేతనే మన కళాశాలకు యిలాంటి ప్రిన్సిపాలే కావాలని అనిపించుకున్నారు.

❖ రోసయ్యగారికి తెలుగు భాషపైవున్న మక్కువకు ప్రతిఫలంగా ఆయన కాలంలోనే (1) పాపినేని శివశంకర్ (2) నాగభైరవ ఆదినారాయణలు అన్ని సబ్జెక్టులను తలదన్ని తెలుగు భాషలో అత్యధిక మార్కులు సాధించి ఆంధ్రా యూనివర్సిటి గోల్డ్ మెడల్స్ సాధించారు. ఈ ఘనతకు తెలుగు విభాగం, ప్రత్యేకించి నాగళ్ల గురు ప్రసాదరావుగారు అభినందనీయులు.

❖ చిన్నయసూరి సంస్మరణ సభలు నిర్వహించి రాష్ట్రంలో పేరెన్నికగన్న కవులను చూచే భాగ్యం, వినే భాగ్యం సాహితీప్రియులందరకు కల్పించారు. ఉత్తమ అభిరుచులకు పునాదులు వేసారు.

భౌతికంగా రోసయ్యగారు మన మధ్య లేకున్నా ఆయన స్మృతులు 1976 వరకు జే.కే.సిలో చదివిన విద్యార్థులందరి మనస్సులలో చెఱగని ముద్ర వేసాయి. జే.కే.సి. కళాశాల ప్రాభవానికి రోసయ్యగారు ప్రధానపాత్ర పోషించగా Founder Secretaryగా డాక్టర్ కాసరనేని సదాశివరావుగారు, Founder Presidentగా జాగర్లమూడి చంద్రమౌళిగారు తమ విజ్ఞతతోనూ ఉదారతతోనూ రోసయ్యగారి విధి నిర్వహణను అన్ని విషయాలలో సమర్థించి ఉత్తమ సాంప్రదాయాన్ని, అత్యుత్తమ విలువలను నెలకొల్పారు.



1986, కుమారుడు రామరాజుభూషణుడు
కోడలు సులోచనాదేవితో